www.prajasakti.com

ప్రజాశక్తి

శుక్రవారం 21 ఫిబ్రవరి 2025



సాగునీరు సక్రమంగా అందించేందుకు చర్యలు

ప్రజాశక్తి - ఆలమూరు

శివారు ప్రాంతాలకు సాగునీరు సక్రమంగా అందించేందుకు వెదురుమూడి కాలువలో వ్యర్థాల తొలగింపుకు చర్యలు చేపట్టినట్లు చింతలూరు సాగునీటి సంఘం అధ్యక్షుడు గారపాటి శ్రీనివాస్ చౌదరి అన్నారు. మండలంలోని జొన్నాడ ఒకటవ నెంబర్ కాలువ పరిధిలోని ఆలమూరు నుంచి సంధిపూడి వరకు గురువారం కూలీల సహకారంతో పూడిక తీత పనులు ఆయన చేపట్టారు. గారపాటి కూలీలతో కాలువలోకి దిగి వ్యర్థాలు, చెత్త చెదారాన్ని తొలగించే ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాగునీరు దిగువ ప్రాంతానికి ఎటువంటి ఆటంకం లేకుండా పారుతుందన్నారు.



కూలీలతో కలిసి పనిచేస్తున్న శ్రీనివాస్ చౌదరి

అధికార పార్టీ అడ్డదారులు

- ఎంఎల్‌సి ఎన్నికల్లో పైచేయి కోసం విశ్వ ప్రయత్నాలు
- ఓటర్లను ప్రలోభ పెట్టేందుకు సన్నాహాలు
- దూర ప్రాంత ఓటర్లతో మంతనాలు
- ఓటు వేసి వెళ్లేందుకు టిక్కెట్లు ఏర్పాటు చేస్తున్న వైనం



దూరప్రాంత ఓటర్ల వివరాల కోసం పంపుతున్న క్యూఆర్‌కోడ్‌తో ఉన్న పోస్టు

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

ప్రతిష్టాత్మకంగా జరుగుతున్న ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల శాసన మండలి ఎన్నికల్లో పాలక కూటమి ఎదురీదుతోంది. ఏదోరకంగా గట్టెక్కాలని టిడిపి అభ్యర్థిగా ఉన్న పేరాబత్తుల రాజశేఖర్ ప్రయత్నం చేస్తున్నారు. దానికి తగ్గట్టుగా అన్ని రకాలుగా అధికార దుర్వినియోగానికి యత్నిస్తున్నట్లుగా ప్రచారం సాగుతోంది. ఓటర్లను ప్రలోభ పెట్టేందుకు ఇప్పటికే ప్రయత్నాలను ముమ్మరం చేస్తున్నారు. పట్టభద్రుల స్థానానికి ఈనెల 27న పోలింగ్ జరగనుంది. బరిలో 35 మంది అభ్యర్థులున్నారు. 3,14,984 మంది ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. మొత్తం 440 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈనెల 25వ తేదీ సాయంత్రం నాలుగు గంటలతో ప్రచారానికి తెరపడనుంది.

అధికారాన్ని ఉపయోగించుకుని...

అధికారాన్ని ఉపయోగించుకుని ఓటర్లను అన్ని రకాలుగా ప్రభావితం చేసేందుకు కూటమి అభ్యర్థి సన్నాహాలు షురూ చేశారనే వార్తలు వినిపిస్తున్నాయి. నామినేషన్ పత్రాల ఆమోదం నుంచి ఈ వ్యవహారం మొదలైపోయింది. నామినేషన్ ప్రక్రియ నాడే అధికార దుర్వినియోగం జరిగింది. నామినేషన్ వేసేందుకు ఏలూరు కలెక్టర్ కార్యాలయంలోకి టిడిపి, జనసేన పార్టీల మంత్రులు, ఎంఎల్ఎలు, నాయకులు చొరబడినప్పటికీ అడ్డుకోకపోవడంపై అప్పట్లో విమర్శలు వచ్చాయి. పోలింగ్ దగ్గరపడుతున్న నేపథ్యంలో ఓటర్లను ప్రభావితం చేసే రీతిలో పలుచోట్ల హామీలను గుప్పిస్తున్నారు. సాధారణ ఎన్నికల మాదిరిగా మొత్తం టిడిపి ఎంఎల్ఎలు అంతా రంగంలోకి దిగారు. జనసేన, బిజెపి నేతలు కూడా అధికార పార్టీ అభ్యర్థిని గెలిపించుకోవడానికి విశ్వ ప్రయత్నాలు సాగిస్తున్నారు. ఎన్నికల కోడ్ ఉన్నప్పటికీ కొన్ని చోట్ల బ్యానర్లు, పెక్సీలు యథావిధిగానే దర్శనమిస్తున్నాయి. అధికారులపై ఒత్తిడి తీసుకొచ్చి తమ ప్రచారానికి వినియోగించుకుంటున్న వైనంపై అనేక రకాలుగా ఫిర్యాదులు వస్తున్నాయి.

ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘిస్తున్న హామీలపై కూడా ఫిర్యాదులు వెలువెత్తుతున్నాయి. ఇదే సమయంలో ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు సుదూర ప్రాంతాలలో ఉన్న వారికి గేలం వేస్తున్నారు. వారితో మంతనాలు సాగిస్తూ రవాణా ఛార్జీల కోసం టిక్కెట్లు తీస్తున్నారు. బెంగుళూరు, హైదరాబాద్, విశాఖపట్నం, విజయవాడ తదితర ప్రాంతాల్లో ఉద్యోగం, ఉపాధి కోసం వెళ్లిన ఓటర్ల వివరాలను ఇప్పటికే సేకరించిన కూటమి అభ్యర్థి వారికి టిక్కెట్లు తీసి ప్రలోభ పెట్టినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనిపై పోటీలో ఉన్న రాజమండ్రికి చెందిన ఒక అభ్యర్థి ఇప్పటికే విలేకరుల సమావేశంలో ఈ విషయాన్ని వెల్లడించడం చర్చనీయాంశంగా మారింది. దీనిపై ఎన్నికల కమిషన్‌కు పిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు. దూరప్రాంత ఓటర్ల కోసం ఒక క్యూఆర్ కోడ్‌తో ఉన్న పోస్టును పంపుతున్నారు.

గతంలో కూడా గోదావరి జిల్లాలో శాసన మండలి ఎన్నికల్లో పట్టభద్రులను ప్రలోభ పెట్టడానికి చేసిన ప్రయత్నాలన్నీ బెడిసి కొట్టాయి. పట్టభద్రులను ప్రసన్నం చేసుకోవడానికి పనితీరుతో మెప్పించాలి తప్ప ఇతర రూపాలలో వాళ్లను ప్రలోభ పెట్టొచ్చని చేసిన అన్ని రకాల యత్నాలు కూడా తిప్పి కొట్టాయి. గతంలో చైతన్య రాజు, అంతకుముందు ఎంఎల్‌సి అభ్యర్థులు చేసిన ప్రయత్నాలకు అధికార పార్టీ అభ్యర్థి కూడా దిగడంతో కూటమి నేతల వ్యవహార శైలిపై పట్టభద్రల నుంచి ఆగ్రహం వ్యక్తం అవుతోంది.

దీనిని అడ్డుకుని తీరతామని ఇప్పటికే పలువురు ఇండిపెండెంట్ అభ్యర్థులు కూడా చెబుతున్నారు. ఇలా అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారని విమర్శలు వెల్లువెతుతున్నా సరే వెనక్కి కూటమి నాయకులు వెనక్కి తగ్గడం లేదు. దీంతో ఇది మరింత ముదిరేలా కనిపిస్తోంది. పట్టభద్రులను ఈ రీతిలో ప్రలోభ పెట్టాలనే ధోరణిపై అందరిలోనూ అసహనం వ్యక్తమవుతోంది. ఇది అధికార పార్టీ కూటమికి అసలుకే ఎసరు పెట్టించేలా ఉందని ఆయా పార్టీల నేతలు కూడా అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికే కూటమిలో జనసేన, బిజెపి నేతలు కొన్నిచోట్ల సహాయ నిరాకరణ చేస్తున్నారు. మరికొన్నిచోట్ల సిట్టింగ్ ఎంఎల్ఎలు కూడా అంటీఅంటనట్లుగా వ్యవహరిస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రలోభాలపై ఆధారపడ్డారనే వార్తలు వినిపిస్తున్నాయి.

'కోరంగి' జోనల్ మాస్టర్ ప్లాన్‌పై సమీక్ష

ప్రజాశక్తి - అమలాపురం



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ మహేష్ కుమార్

స్థానిక కలెక్టరేట్లో గురువారం జిల్లా అటవీ శాఖ అధికారి ఎంవి.ప్రసాద్ రావు, కాకినాడ జిల్లా అటవీ శాఖ అధికారి డి. రవీంద్రనాథ్ రెడ్డితో కలిసి కోరంగి వైల్డ్ లైఫ్ అభయారణ్యం జోనల్ మాస్టర్ ప్లాన్ తయారీపై వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ కోరంగి వైల్డ్ లైఫ్ అభయారణ్యం పరిధిలో వివిధ శాఖల ద్వారా కార్యకలాపాలు నిర్వహిస్తున్న వివరాలను పొందు పరుస్తూ ఎకో- సెన్సిటివ్ జోనల్ మాస్టర్ ప్లాన్ తయారీకి నిర్దేశిత ప్రొఫార్మాలో వివరాలను సూచనలతో సమర్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎకో సెన్సి టివ్ జోన్ పర్యావరణ రక్షణను పరిరక్షించడానికి ప్రభుత్వంచే గుర్తించబడిన ప్రాంతమని, జాతీయ పార్కులు, వన్య మృగ అభయారణ్యాలు వంటి రక్షిత ప్రాంతాల చుట్టూ జీవవైవిధ్య పర్యావరణ వ్యవస్థలను సహజ వనరులను సుస్థిరాభివృద్ధికి కనిష్ట పర్యావరణ ప్రభావాన్ని నిర్ధారిస్తూ పర్యావరణ టూరిజం వంటి పర్యా వరణ అనుకూల కార్య క్రమాలను అనుమతిస్తారన్నారు. జిల్లా పరిధిలో ఎకో సెన్సిటివ్ జోన్ సరిహద్దు 50 మీటర్ల నుండి సముద్రం లోపల ఐదు కిలోమీటర్ల పరిధి జిల్లాలో 12 కిలో మీటర్ల పొడవునా ఎకో సెన్సిటివ్ జోన్ ఉందని తెలిపారు. కేవలం కాట్రేనికోన మండలం బ్రహ్మ సమాజం, ఐ పోలవరం మండలంలో గుత్తిన దీవి, రెవెన్యూ గ్రామాల పరిధిలో జోన్ ఉందని సంబంధిత అధికారులు సామాజిక ఆర్థిక పరిస్థితులు జీవ నశైలి కార్యకలాపాలు సైంటిఫిక్ మ్యాపులు వంటి అంశాలను మూడు పారామీటర్ల వారీగా రూపొందించి మార్చి 15 నాటికి డ్రాఫ్ట్ మాస్టర్ ప్లాన్ సిద్ధం చేసి సమర్పించాలని ఆదే శించారు. ఈ సందర్భంగా డీఎఫ్‌ఓ రవీంద్రనాథ్ రెడ్డి కోరంగి వైల్డ్ లైఫ్ అభయారణ్యం జోనల్ మాస్టర్ ప్లాన్ తయారీ ఆవశ్యకతను సభ్యులకు వివరించారు. అభయారణ్యం బయట ఉన్న సరిహద్దు నుంచి వివిధ ప్రదేశాలను కలుపుతూ 12 కిలోమీటర్ల పొడవునా ఎకో -సెన్సిటివ్ జోన్ ఉందన్నారు. ఈ జోన్ వల్ల వన్యప్రాణుల స్వేచ్ఛకు, మనుగడకు మరింత భద్రత ఏర్పడు తుందన్నారు. పర్యా వరణ సమతుల్యత నెలకొని పచ్చదనం పెంపొందడంతో పాటు సేంద్రియ వ్యవసాయానికి అవకాశం ఉంటుందన్నారు. ఈ జోన్ పరిధిలో వర్షపు నీటిని వివిధ పద్ధతుల్లో నిలువ చేసు కుని జంతువులకు తాగునీటి సమస్య లేకుం డా చేయవచ్చునని వివరించారు. మొట్టమొదటి సారిగా జోనల్ మాస్టర్ ప్లాన్ తయారీ కాకినాడ కోనసీమ జిల్లాలలో జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో హైదరా బాద్ సెంటర్ ఫర్ ఎన్విరాన్మెంట్ డెవల ప్మెంట్ రీజినల్ డైరెక్టర్ డాక్టర్ కె.జయచంద్రజీ, పశు సంవర్ధక శాఖ జెడి ఎస్.వెంకట్రావు, డిఆర్‌డిఎ పీడీ శివశంకర్ ప్రసాద్, జిల్లా వ్యవసాయ అధికారి బోసు బాబు, డ్రెయినేజీ ఇంజినీర్ ఎంవివి.కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

ధరల నియంత్రణకు చర్యలు

ప్రజాశక్తి - అమలాపురం

మార్కెటింగ్ పౌరసరఫరాల అధికారులు నిత్యవసర వస్తువులు కూరగాయల ధరలు నియంత్రణకు చర్యలు చేపట్టాలని జెసి టి.నిషాంతి ఆదేశించారు. గురువారం స్థానిక కలెక్టరేట్లోని గోదావరి భవన్ నందు పౌర సరఫరాలు మార్కెటింగ్ శాఖ ఎస్టేట్ అధికారులతో ధరల నియంత్రణ మానిటరింగ్ కమిటీ సమావేశం జెసి అధ్యక్షతన నిర్వహించారు. జెసి మాట్లాడుతూ స్థానికంగా ఏర్పాటు చేసిన రైతు బజార్ మూలంగా బయటి మార్కెట్లో ధరలు తగ్గు ముఖం పట్టాయని రైతు బజార్ నిర్వహణ తీరును మరింత మెరుగుపరుస్తూ అన్ని రకాల నిత్యావసరాలు, కూరగాయలు ఒకే చోట లభించేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా వ్యాప్తంగా అన్ని రైతు బజార్లలో ఒకే రకమైన ధరలు ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. తాజాగా వినియోగదారులకు కూరగాయలు అందిస్తూ కూరగాయల పండించే రైతులు నేరుగా రైతు బజార్లో గిట్టుబాటు ధరలు పొందాలని మధ్యవర్తులను ఆశ్రయించరాదన్నారు. తూనికలు కొలతల్లో వ్యత్యాసాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించరాదన్నారు. గ్యాస్ డెలివరీ వ్యక్తులు గ్యాస్ సిలిండర్ కు అధికంగా డెలివరీ ధరలు వసూలు చేస్తే కఠిన చర్యలు తీసు కోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారిని కె.విశాలాక్షి, డిఎస్ఓ ఎ.ఉదయభాస్కర్, పౌర సరఫరాల సహాయ మేనేజర్ నాగేశ్వరరావు, తూనికలు కొలతలు శాఖ కంట్రోలర్ రాజేష్, ఎస్టేట్ అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జెసి

గుండెపోటుతో రిటైర్డ్ వ్యాయామోపాధ్యాయుడు కాశీ మృతి

ప్రజాశక్తి - అమలాపురం

అమలాపురానికి చెందిన రిటైర్డ్ వ్యాయామోపాధ్యాయుడు రంకిరెడ్డి కాశీ(65) గురువారం గుండె పోటుతో మరణించారు. ప్రముఖ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు సాత్విక్ సాయిరాజ్ ఈయన కుమారుడే. కాశీ మరణంపట్ల పట్టణానికి చెందిన రాష్ట్ర టిడిపి కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, నాయకులు దిగ్భ్రాంతికి గురయ్యారు. మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి భౌతిక కాయానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. వారితో పాటు కోనసీమ జిల్లా బ్యాడ్మింటన్ అధ్యక్షులు అల్లాడ శరత్, మున్సిపల్ మాజీ ఛైర్మన్ చిక్కాల గణేష్, కౌన్సిలర్ బొర్రా వెంకటేశ్వరరావు, మాజీ కౌన్సిలర్ వెలిగట్ల లక్ష్మణరావు, కంచిపల్లి అబ్బులు, పబ్బినీడి సత్యనారాయణ, కల్వకొలను వెంకటరమణ, డాక్టర్.విష్ణుమూర్తి, పట్టణ ప్రముఖులు తదితరులు రంకిరెడ్డి కాశీ మృతికి నివాళులు అర్పించారు.



రంకిరెడ్డి కాశీ(ఫైల్ ఫొటో)

300 మందికి ఉచిత వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - కపిలేశ్వరపురం

మండపేట ఫిషర్ మెన్ కళ్యాణ మండపంలో గురువారం సూర్యచంద్ర ఫిషర్ మెన్ సోసైటీ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరంలో 300 మందికి వైద పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా అంబాజీపేట లేజర్, రైట్ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ సైనీ, డాక్టర్ మౌనిక పర్యవేక్షణలో నిర్వహించిన ఆర్థోపెడిక్, డెంటల్, కంటి వైద్య శిబిరాన్ని రాష్ట్ర అంచనాల కమిటీ ఛైర్మన్, ఎంఎల్ఎ వేగుళ్ళ జోగేశ్వరరావు ప్రారంభించారు. ఈ వైద్య శిబిరంలో పలు వ్యాధులకు సంబంధించి 300 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు. అలాగే కంటి పరీక్షలు నిర్వహించి అవసరం ఉన్నవారికి ఉచితంగా కళ్లద్దాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, సూర్యచంద్ర ఫిషర్ మెన్ సోసైటీ అధ్యక్షులు కాటా గోపి, సెక్రటరీ పాండ్రంకి చిన్న, సింగిడి చిన్నారావు, ఆబోతు భద్రరావు, కాటా శ్రీరాములు, జంపా తాతాజీ, కాటా బుజ్జి, పాండ్రంకి సత్తిబాబు, గుండు తాతారాజు, పొలమూరి శ్రీను, ఆబోతు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ వేగుళ్ల

ఎన్.కొత్తపల్లిలో దోమల నిర్మూలనకు చర్యలు

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం

ఎన్.కొత్తపల్లి గ్రామంలో దోమల బెడద విపరీతంగా ఉన్న కారణంగా వాటిని నిర్మూలించేందుకు చర్యలు చేపట్టినట్టు సర్పంచ్ కుంచే చిట్టికుమారి తెలిపారు. ఎన్.కొత్తపల్లిలో గురువారం దోమల నిర్మూలనకు పంచాయతీ కార్మికులు ఫాగింగ్ చేపట్టారు. ఈ సందర్భంగా ఫాగింగ్ పనులను సర్పంచ్ చిట్టి కుమారి పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గ్రామంలోని ప్రతీ వీధిలోను దోమల నిర్మూలనకు చర్యలు చేపట్టామని అన్నారు. ప్రజలు చెత్తను ఎక్కడపడితే అక్కడ విచ్చలవిడిగా వేయకూడదని సర్పంచ్ సూచించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకుడు కుంచే చిన్ని, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ఎన్. కొత్తపల్లిలో ఫాగింగ్ ను పరిశీలిస్తున్న సర్పంచ్ చిట్టి కుమారి

24న వాహనాల బహిరంగ వేలం

ప్రజాశక్తి - ఆలమూరు

స్థానిక ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో వివిధ కేసులలో సీజ్ చేసిన వాహనాలను ఈ నెల 24న బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఆలమూరు ఎక్సైజ్ సిఐ ఐడి.నాగేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రొబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ కాకినాడ వారి ఆదేశాల మేరకు ఫిబ్రవరి 24న ఉదయం 10 గంటలకు సీజ్ చేసిన వాహనాలను వేలంపాట నిర్వహిస్తామన్నారు. వేలంపాటలో పాల్గొని తెలిసిన వారి యొక్క గుర్తింపు కార్డుతో వచ్చి రూ.2000 ధరావత్తు రుసుం చెల్లించాలని ఆయన సూచించారు. పాటలో వాహనం దక్కించుకున్న వారు దాని ధరతో పాటు 18 శాతం జిఎస్‌టి చెల్లించి తీసుకువెళ్లాలని ఆయన చెప్పారు. అయితే వేలం పాట రద్దు చేయటం గాని వాయిదా వేయడం గానీ పూర్తి అధి కారాలు ఎక్సైస్ శాఖకు చెంది ఉంటాయని ఎక్సైజ్ సిఐ నాగేశ్వరరావు తెలిపారు. వివరాల కోసం కార్యాలయంలో సంప్రదించాలని ఆయన కోరారు.



వివరాలు వెల్లడిస్తున్న ఎక్సైజ్ సిఐ నాగేశ్వరరావు

పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

ప్రజాశక్తి - అమలాపురం

ఈనెల 23న నిర్వహించనున్న గ్రూప్-2, మార్చి ఒకటో తేదీ నుంచి నిర్వహించనున్న ఇంటర్మీడియట్ ప్రథమ ద్వితీయ పబ్లిక్ పరీక్షలు పకడ్బందీగా ఎ నిర్వహించాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. గురువారం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వివిధ శాఖల ముఖ్య కార్యదర్శులతో అమరావతి నుండి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఎపిపిఎస్‌సి వారి గ్రూప్ -2, ఇంటర్ పరీక్షల నిర్వహణ, పి4 సర్వే ఎంఎస్ఎం ఈ సర్వే ప్రజా సంతృప్తికి గీటురాయిగా ప్రవేశపెట్టిన ఐవిఆర్ఎస్ వాట్సాప్, క్యూఆర్ కోడ్ విధానాల పురోగతి, జిల్లాల వారీగా ర్యాంకులపై జిల్లా కలెక్టర్లకు దిశా నిర్దేశం చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ అనంతరం అధికారులను ఉద్దేశించి అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ మాట్లాడుతూ ఇంటర్, గ్రూప్-2 పరీక్షల నిర్వహణకు స్క్వాడ్లు, ఇన్విజిలేటర్లు బృందం సమన్వయంతో ప్రశ్నావళి జవాబు పత్రాల భద్రత ఎస్కార్ట్ నడుమ తరలింపు అంశాలలో అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. శాంతియుత వాతావరణంలో సజావుగా పరీక్షలు నిర్వహించాలన్నారు. సమస్యాత్మక పరీక్షా కేంద్రాల వద్ద భద్రతను మరింత పెంచాలన్నారు. సిసి కెమెరాల నిఘా వ్యవస్థను జిల్లా స్థాయి కంట్రోల్ రూమ్ కు అనుసంధానం చేస్తూ నిశితంగా పరీక్షల నిర్వహణ తీరును పర్యవేక్షించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం జీరో పేదరిక నిర్మూలన కొరకు స్వర్ణాంధ్రవిజన్లో మొదటి అంశంగా ఉన్న ప్రభుత్వ- ప్రయివేటు - ప్రజల- భాగస్వామ్య పి.4 వ్యవస్థను ఉగాది నుండి అమలు చేయనున్నారని, ఈ లోపుగా రెండవ దశ సర్వే గ్రామ సభలు విజయవంతంగా నిర్వహించేందుకు సిపిఒ, జిఎస్‌డబ్ల్యూఎస్ అధికారులు మాస్టర్ ట్రైనర్లలకు శిక్షణలు ఇప్పిస్తూ సర్వేకు సిబ్బందిని సర్వసన్నద్ధం కావాలన్నారు. పేదరికాన్ని నిర్మూలించడానికి ప్రత్యేక చొరవను ప్రభుత్వం తీసుకోవడం జరిగిందన్నారు. అత్యున్నత ఆర్థిక స్థానాల్లో ఉన్న వారిలో 10 శాతం మంది, దిగువన ఉన్న 20 శాతం మందికి సహాయం చేసి, వారికి సాధికారత కల్పిస్తే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని ప్రభుత్వం విశ్వసిస్తోందన్నారు. పి4 కోసం సమగ్ర మార్గదర్శకాలను రూపొందించడానికి ప్రజల నుండి సూచనలు, అభిప్రాయాలు సలహాలను స్వీకరించాలన్నారు. కొంతమంది పారిశ్రామికవేత్తలు, ఎన్నారైలు సమాజంలో ప్రముఖ పదవులు నిర్వహిస్తున్న వ్యక్తులు పేదలకు సహాయం అందించడానికి ఆసక్తి చూపుతున్నారన్నారు. తక్కువ ప్రాధాన్యత కలిగిన వారిని గుర్తించడానికి ప్రత్యేక సర్వే ద్వారా వెనుకబడిన వర్గాలను గుర్తించాలన్నారు. ఈ ప్రయోజనం కోసం అవసరమైన డేటాను సేకరించాలన్నారు. పారిశ్రామికవేత్తలు తమ స్వస్థలాలు, మండలాలను అభివృద్ధి చేసుకోవడానికి ఇప్పటికే ముందుకు వచ్చారని పి4 వ్యవస్థను ఆవిష్కరించడానికి అటువంటి వ్యక్తులందరినీ ఆహ్వానిస్తారన్నారు. కార్యక్రమంలో జెసి టి.నిషాంతి, సిపిఒ వెంకటేశ్వర్లు ఇంటర్మీడియట్ బోర్డ్ అధికారి సోమశేఖరరావు, జిఎస్‌డబ్ల్యూఎస్ కోఆర్డినేటర్ ఎస్.త్రినాధరావు, జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ పికెపి.ప్రసాద్, డిఐపిఆర్ఒ కె.లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వైసిపి మహిళా జిల్లా అధ్యక్షురాలు గిరిజాకుమారికి ఘన సత్కారం

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం

వైసిపి మహిళా జిల్లా అధ్యక్షురాలిగా నియమితులైన సన్నవిల్లి-నంగవరం ఎంపిటిసి సభ్యురాలు వంగా గిరిజాకుమారిని గురువారం అమలాపురం నియోజకవర్గ వైసిపి సీనియర్ నాయకుడు గుడ్‌సీడ్ ఫౌండేషన్ ఫౌండర్ కుంచే రమణారావు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సన్నవిల్లిలోని గిరిజాకుమారిని ఆమె నివాసంలో రమణారావు దుశ్శాలువా కప్పి పూలమాలలతో ఘనంగా సత్కరించారు. రమణారావు మాట్లాడుతూ పదవి ద్వారా వైసిపి బలోపేతానికి, పార్టీ పూర్వ వైభవానికి గిరిజాకుమారిక కృషిచేసి మరిన్ని ఉన్నత పదవులు చేపట్టాలని ఆకాంక్షించారు. గిరిజాకుమారిని సత్కరించిన వారిలో భీమనపల్లి సర్పంచ్ పెయ్యల రాజ్ కుమార్, వైసిపి మండల కార్యదర్శి పినిపే జయరాజ్, వైసిపి నాయకులు నేలపూడి సుగంధ కుమార్, గంటా లక్ష్మీ ప్రసాద్, పందిరి సుబ్బరాజు తదితరులు ఉన్నారు.



గిరిజాకుమారిని సత్కరిస్తున్న రమణారావు, నాయకులు

కార్టూ'నిజం'





మొక్కలు నాటుతున్న నాయకులు

పచ్చదనం, పరిశుభ్రతతో ఆరోగ్యం

ప్రజాశక్తి - కొత్తపేట

పచ్చదనం- పరిశుభ్రతతో ఆరోగ్యంగా ఉండవచ్చునని గ్రామ సర్పంచ్ బూసి విజయలక్ష్మి భాస్కరరావు, మండల టిడిపి అధ్యక్షుడు కంఠంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. పచ్చదనం- పరిశుభ్రతలో భాగంగా కొత్తపేట విశ్వకవివేమన ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎంఎల్ఎ బండారు సత్యానందరావు అందించిన మొక్కలను కొత్తపేట టిడిపి నాయకులు గురువారం కళాశాల ఆవరణలో నాటారు. మండల తెలుగు రైతు అధ్యక్షుడు చోడపనీడి భాస్కరరావు, బూత్ కన్వీనర్లు ముద్రగడ సుబ్బారావు, ముద్రగడ పణిరాజు, ప్రిన్సిపాల్ పెద్దిరాజు, సిబ్బంది పాల్గొన్నారు..

ఆప్కోస్‌ను రద్దు చేయొద్దని వినతి

ప్రజాశక్తి - ముమ్మిడివరం

ఉద్యోగ, కార్మిక హక్కులను పరిరక్షించే ఆప్కోస్ రద్దు నిర్ణయాన్ని తక్షణమే వెనక్కి తీసుకోవాలని ముమ్మిడివరం నగర పంచాయతీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ డిమాండ్ చేసింది. నగర పంచాయతీ కార్యాలయం ఆవరణలో మున్సిపల్ పారిశుధ్య ఇంజినీరింగ్ కార్మికుల అత్యవసర సమావేశం మండల సిఐటియు అధ్యక్షుడు నిమ్మకాయల వెంకటేష్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ఉద్యోగ కార్మికులకు సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు సమాన పనికి సమాన వేతనము అమలు చేయకుండా, ఉద్యోగ భద్రత క్షల్పించే అవుట్ సోర్సింగ్ విధానాన్ని రద్దు చేసి, ఉద్యోగ, కార్మికులను ప్రయివేటు ఏజెన్సీలకు అప్పగించే విధంగా కూటమి ప్రభుత్వం ఆప్కోస్ రద్దు చేస్తూ క్యాబినెట్ సమావేశంలో నిర్ణయం తీసుకోవడం ఉద్యోగ, కార్మిక సంఘాలను నిర్వీర్యం చేయడమేనని అన్నారు. సుప్రీమ్ కోర్టు ఆదేశాల మేర్సీకు కార్మికులందరికి సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని, ఉద్యోగుల హక్కులను హరించే ఆప్కోస్ రద్దు వద్దు అంటూ నినాదాలు చేశారు. అనంతరం కమిషనర్ రవీవర్మకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమ ంలో నక్కా అరుణ్ కుమార్, సురేష్, నిమ్మ కాయల వెంకటేష్, పలివేల రాంబాబు, బుంగాకుమార్, స్వామి, మోర్త భార్గవ్, పలివేల నాగలక్ష్మి,రేవు వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



కమిషనర్‌కు వినతిపత్రంఇస్తున్న ఇంజినీరింగ్ కార్మికులు

నేడు నాలుగు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి,-మామిడికుదురు

పాశర్లపూడి మెయిన్ రోడ్ లో 11కెవి లైన్ విద్యుత్ స్తంభాలు మారుస్తుండడంతో శుక్రవారం ఉదయం 8.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నాలుగు గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు అమలాపురం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రాంబాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరం విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో పాశర్లపూడి బాడవ, బి.దొడ్డవరం, పెదపట్నం లంక, పాశర్లపూడి లంక గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.



దాతలకు స్వామివారి చిత్రపటం అందజేస్తున్న ఆలయ ఉద్యోగులు

నిత్యాన్నదానానికి రూ.30 వేల విరాళం

ప్రజాశక్తి - మామిడికుదురు

అప్పనపల్లి శ్రీ బాల బాలాజీ దేవస్థానం శాశ్వత నిత్యాన్నదాన ట్రస్ట్‌కు గురువారం హైదరాబాదు వాసులు జ్ఞాన ప్రభాకర్‌రావు, నాగరత్నం కుటుంబ సభ్యులు రూ.30 వేలు విరాళం అందజేశారని ఆలయ సహాయ కమిషనర్ ఎం సత్యనారాయణ రాజు తెలిపారు ఆలయ అర్చకులు వారికి వేద ఆశీర్వాదం అందజేసి స్వామి వారి చిత్రపటం ప్రసాదము అందజేశారన్నారు

అప్పనపల్లి నుంచి అయినవిల్లి బస్సు సర్వీసు

యాత్రికుల సౌకర్యార్థం రాజోలు ఆర్‌డిసి డిపో వారి ఆధ్వర్యంలో అప్పనపల్లి నుంచి అయినవిల్లి బస్సు సర్వీస్ నడుపుతున్నట్లు ఆలయ సహాయ కమిషనర్ తెలిపారు అప్పనపల్లి నుంచి 6.45 ఎఎం, 10.45ఎఎం, 2.45 పిఎం టైములో బస్సు బయలుదేరుతుందని యాత్రికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు

నేరాలు ఘోరాలు

వ్యక్తిపై కత్తితో దాడి

ప్రజాశక్తి - పిఠాపురం

పిఠాపురం మండలంలోని కుమారపురం గ్రామంలో వ్యక్తిపై కత్తితో దాడి చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్థానికులు,పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కుమారపురం గ్రామానికి చెందిన బి.రామకృష్ణ భార్యను అదే గ్రామానికి చెందిన టి.అనంతయ్య అసభ్య పదజాలంతో దూషించాడు. ఈ సమయంలో అటుగా వస్తున్న రామకృష్ణ సోదరుడు బి.శ్రీనివాస్ అతన్ని ప్రశ్నించాడు. దీంతో వారి ఇరువురి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ నేపథ్యంలో కోపోద్రిక్తుడైన అనంతయ్య కత్తి తీసుకొని శ్రీనివాస్‌పై దాడి చేశాడు. శ్రీనివాస్ తలకు గాయమైంది. కుటుంబ సభ్యులు అతన్ని చికిత్స నిమిత్తం పిఠాపురంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. దీనిపై రూరల్ ఎస్ఐ గుణశేఖర్ కేసు నమోదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి -దేవరపల్లి

దేవరపల్లి మండలం గౌరీపట్నం ఫ్లైఓవర్ వద్ద ఆగి ఉన్న వ్యాను వెనుక నుంచి స్కూటీ ఢీకొనడంతో ఒక వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఏలూరుకు చెందిన ఎస్కే గౌంచి విజయవాడ వద్ద గల కంకిపాడు గ్రామానికి చెందిన కల్లూరు వినయ్‌కుమార్ బైక్‌పై ఏలూరు నుంచి నర్సీపట్నం వెళుతున్నారు. వీరు గౌరీపట్నం ఫ్లై ఓవర్ వద్దకు వచ్చేసరికి అక్కడ ఆగి ఉన్న బసర్ వ్యానును ఢీకొన్నారు. తీవ్రంగా గాయపడిన వారిని హైవే అంబులెన్స్‌లో కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో కల్లూరు వినయ్‌కుమార్ మృతి చెందాడు. ఈ మేరకు ఎస్ఐ కె.నాగభూషణం కేసు నమోదు చేశారు.

ఈవ్‌టీజింగ్ కేసులో యువకుని అరెస్ట్

ప్రజాశక్తి - తాళ్లపూడి

తనని ప్రేమించడం లేదని కోపంతో కళాశాలకు వెళ్లి ఆమె దాడి చేసిన ఘటనకి సంబంధించి కేసు నమోదు చేసి నిందితున్ని అరెస్టు చేసినట్లు తాళ్లపూడి ఎస్ఐ టి.రామకృష్ణ తెలిపారు. మండలంలోని వేగేశ్వరపురం గ్రామంలో గల జూనియర్ కళాశాలలో ఇంటర్ చదువుకుంటున్న ఒక యువతిని నిందితుడు గొల్ల దిలీప్‌కుమార్ ప్రేమపేరుతో వేధించాడు. తనను ప్రేమించాలంటూ ఆమెను వేయకూడా చేసుకున్నాడు. యువతి నుంచి స్పందన లేకపోవడంతో బుధవారం మరోసారి కాలేజీకి వెళ్లి తనని ప్రేమించకపోతే వదిలేది లేదని, జీవితాన్ని పాడు చేస్తానని బెదిరించాడు. యువతిని కొట్టాడు. దీనిపై యువతి తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదవు చేసి నిందితుని అరెస్టు చేశామని ఎస్ఐ తెలిపారు.



చైతన్యరాజును పరామర్శిస్తున్న ఎంఎల్ఎ ఆనందరావు

కిమ్స్ చైర్మన్ చైతన్య రాజుకు మాతృ వియోగం

ప్రజాశక్తి - అమలాపురం

కిమ్స్ చైర్మన్, మాజీ ఎంఎల్‌సి చైతన్య రాజు మాతృమూర్తి కలిదిండి లక్ష్మీ కాంతం (87)గురువారం ఆమె మరణించారు. ఈ సందర్భంగా ఆయనను పలువురు ప్రముఖులు పరామర్శించారు. కలిదిండి లక్ష్మీ కాంతం మృతి పట్ల అమలాపురం ఎంఎల్ఎ అయితాబత్తుల ఆనందరావు సంతాపం వ్యక్తం చేశారు. అమలాపురం కిమ్స్ కళాశాలకు వెళ్లి ఆమె మృత దేహంపై పూలమాల వేసి నివాళులు అర్పించారు.

రిటైర్డ్ వ్యాయామోపాధ్యాయుడు మృతికి సంతాపం

రిటైర్డ్ వ్యాయామ ఉపాధ్యాయులు రంకిరెడ్డి కాశీ గురువారం గుండెపోటుతో మరణించారు. మృతుని కుటుంబీకులను ఎంఎల్ఎ ఆనందరావు పరామర్శించారు. కాశీ మృతి పట్ల ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.

ఇటుక బట్టీలతో అవస్థలు

- జొన్నాడ, ఆలమూరు రోడ్డును ఆక్రమిస్తున్న బట్టీలు
- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు
- ఆక్రమణలతో పోరంబోకు, బోదెల భూములు
- పట్టించుకోని అధికార యంత్రాంగం

ప్రజాశక్తి - ఆలమూరు

జొన్నాడ నుంచి మండపేట వెళ్లే ఆర్అండ్‌బి ప్రధాన రహదారి చెంతన, రహదారికి ఇరువైపుల సుమారు రెండు కిలోమీటర్ల మేర 50 ఇటుక బట్టీలు వరకు రహదారికి ఆనుకొని పలువురు నిర్వాహకులు ఏర్పాటు చేసుకున్నారు. దీంతో జొన్నాడ నుంచి మండల కేంద్రం ఆలమూరుకు వెళ్లడానికి ప్రయాణికులు ప్రతి రోజు అవస్థలు పడుతున్నారు. ఇటుక బట్టీ నిర్వహణలో భాగంగా ఇటుకలు కాల్చేందుకు ఆవలకు నిప్పు పెట్టడంతో వచ్చే పొగ రహదారిని కమ్మేయడంతో ఆ పొగదూరాన్ని పీల్చుతూ వాహనదారులు పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో ప్రయాణికులకు ఈ పొగ కళ్లకు వ్యాపించడంతో ఒక్కోసారి ప్రమాదాలకు ప్రత్యక్ష కారణభూతమవుతుందని అందరికీ తెలిసిందే. అయితే అనునిత్యం రహదారిపై వాహనాలు రాకపోకలతో రద్దీగా ఉండే ఈ ప్రాంతంలో ఇటుక బట్టీలు ఏర్పాటు చేస్తుంటే అధికార యంత్రాంగం ఏం చేస్తుందని పలువురు బాహాటంగానే ప్రశ్నిస్తున్నారు.



ఆర్అండ్‌బి రహదారిపై కమ్మిన పొగతో వాహనదారుల ఇబ్బందులు

రోడ్డు మార్జిన్ ఆక్రమించినా ..

నిర్వాహకులు రహదారి చెంతన బట్టీలకు వాడే బూడిద, ఫైర్ ఫ్లై, ఊక, తదితర వస్తువులతో రోడ్డు మార్జిన్ వరకు ఆక్రమించడాన్ని వాహనదారులు ఆక్షేపిస్తున్నారు. ఇంత సమస్యను ఎదుర్కొని రోడ్డుపై ప్రయాణికులు రాకపోకలు సాగించాలంటే వాహనదారుల ఇక్కట్లకు అదుపే లేకుండా పోతుందని పలువురు అంటున్నారు. అలాగే కాలిన బూడిద గాలికి ఎగిరి కళ్లల్లో పడుతుందని, దీనివల్ల ప్రమాదాలు సంభవిస్తున్నాయని పలువురు వాపోతున్నారు. రహదారి పక్కన వేసిన ఇటుక వ్యర్థాలను బట్టీ ఆవలకు నిప్పు పెట్టిన సమయంలో ఈ పొగ రహదారిని కమ్మి దారి కనిపించక పలువురు వాటిని గుద్దుకొని, ప్రమాదాలకు గురైన సంఘటనలు, క్షతగాత్రులుగా మారిన ఘటనలు ఎన్నో ఉన్నాయి. అలాగే గాలి వీసే సమయంలో నిప్పు రవ్వలు ఎగిసిపడి ప్రయాణికులపై పడిన సందర్భాల్లో పలువురు దుస్తులు కాలి ఇబ్బందులు పడిన సంఘటనలు కోకొల్లలు.



జొన్నాడ-ఆలమూరు మధ్య రహదారిని ఆక్రమించిన బట్టీ యజమానులు

అధికారులు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి

అధికారుల పర్యవేక్షణ కొరవడి తిరిగి ఇటుక బట్టీలు ఆక్రమణల పర్వం కొనసాగిస్తూ అంచెలంచెలుగా విస్తరిస్తు ప్రస్తుతం యథాస్థానానికి చేరుకున్నాయి. రోడ్డు మార్జిన్‌కి సుమారు 200 మీటర్ల దూరంలో నిర్వహించుకోవాల్సిన బట్టీలు రోడ్డుకు చేరుకున్నాయి. ఇదే క్రమంలో అధికారులు అలసత్వం వహిస్తే రోడ్డుపైన వారు నిల్వలు పెట్టే పరిస్థితి కొనసాగిన ఆశ్చర్యపోవలసిన పని లేదని పలువురు విమర్శిస్తున్నారు. ఇకనైనా అధికారులు చర్యలు తీసుకొని రహదారికి సుదూరంగా బట్టీలను నిర్వహించుకునేలా ఆజ్ఞలు జారీ చేయాలని పలువురు కోరుతున్నారు. సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు, వాహనదారులు కోరుతున్నారు.



బాబ్జి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న రమణారావు తదితరులు

సామాజిక వేత్త బాబ్జి మృతి తీరని లోటు

ప్రజాశక్తి - అమలాపురం రూరల్

వన్నె చింతలపూడికి చెందిన సామాజిక వేత్త, ఉద్యమకారులు పచ్చిమాల బాబ్జి మృతి తీరని లోటని అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ సీనియర్ వైసిపి నాయకుడు, గుడ్ సీడ్ ఫౌండేషన్ ఫౌండర్ కుంచే రమణారావు అన్నారు. గురువారం వన్నెచింతలపూడిలోని బాబ్జి కుటుంబాన్ని రమణారావు పరామర్శించారు. బాబ్జి చిత్రపటానికి రమణారావు పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. రమణారావు మాట్లాడుతూ బాబ్జి కుమారుడు, సిపిఎం నాయకులు వసంతకుమార్ గత ఏడాది ఆకస్మిక మృతి చెందారని అన్నారు. బాబ్జి, ఆయన కుమారుడు వసంతకుమార్ పేద వర్గాల ప్రజల హక్కుల కోసం పోరాటం చేశారని కొనియాడారు. పరామర్శించిన వారిలో గంటా లక్ష్మీప్రసాద్, పందిరి సుబ్బరాజు, పడమట శ్రీనివాసరావు, కందేరి వెంకటరమణ, పరమట రాజేష్, మోర్త అవినాష్, పరమట అశోక్, కుంచే అర్జున్, పచ్చి మాల శివ తదితరులు ఉన్నారు.

జిల్లాకు మంచి ర్యాంకింగ్ తీసుకురావాలి

కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్

ప్రజాశక్తి - అమలాపురం

ప్రభుత్వ సేవలపై సంతృప్తి స్థాయిలను పర్యవేక్షించేందుకు వివిధ పథకాల అమలు, కార్య క్రమాలకు సంబంధించి పారామీట ర్లను రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిందని వాటి ద్వారా జిల్లాకు మంచి ర్యాంకింగ్ తీసుకుని రావాలని కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ అధికారులు ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ నుంచి మండలస్థాయి వరకు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జిల్లా స్థాయి అధికారులు, ఎంపిడిఒలు, మున్సిపల్ కమిషనర్లు, నియోజకవర్గ ప్రత్యేక అధికారులతో ఐవిఆర్ఎస్ వాట్సాప్, క్యూఆర్ కోడ్ విధానాలు ద్వారా వివిధ సంక్షేమ పథకాలు కార్యక్రమాలు అమలుకు సంబంధించి ప్రజల నుంచి అభిప్రాయాలను ప్రభుత్వం సేకరిస్తుందన్నారు. ఈ సంతృప్తి స్థాయిల సేకరణలో లబ్ధిదారుల నుంచి అసంతృప్తి వెలువెత్తుతున్నట్లు నివేదికల ర్యాంకింగులు స్పష్టం చేస్తున్నాయని అన్నారు. ఎన్‌టిఆర్ భరోసా పింఛను, దీపం-2, ఆసుపత్రి వైద్య సేవలు, చెత్త నుంచి సంపద తయారీ కేం ద్రాలు, అన్న క్యాంటీన్లు రీ సర్వే అంశాలు, బస్సులు బస్టాండ్లలో వసతులు పారిశుధ్య నిర్వహణ వంటి అంశాల పై పూర్తిగా అధ్యయనం చేస్తూ సంతృప్తి స్థాయిలలో రెండు వారాలలో ఆశించిన పురోగతిని సాధించాలని ఆయన ఆదేశించారు. ప్రభుత్వం డిజిటల్ ఆధునిక సాంకేతికతను వినియోగిస్తూ పౌరులకు సులభతరంగా వాట్సాప్ ద్వారా ప్రస్తుతం 150 రకాల సర్వీసులను అంది స్తుందని అదేవిధంగా పరిపాలనపరంగా సంతృప్తి స్థాయిలను ఐవిఆర్ఎస్ ద్వారా లబ్ధిదారుల ఫోను చేయడంతో పాటు క్యూఆర్ కోడ్ ద్వారా లబ్ధిదారుల అభిప్రాయాలను సంతృప్తి స్థాయిలను పర్యవేక్షిస్తుందని అన్నారు. ఈ నేపథ్యంలో లబ్ధిదారుల నుంచి అసంతృప్తి వెలువడితోందని నివేది కలు ర్యాంకులు తేట తేలం చేస్తున్నాయన్నారు ఇకపై అధికారులు అన్ని అంశాల పట్ల క్షుణ్ణంగా అధ్యయనం చేసి పనితీరును మెరుగు పరుస్తూ ర్యాంకింగులు సాధనకు పాటుపడాలని అన్నారు. ర్యాంకింగులు సాధనలో ప్రధాన అడ్డంకులు, కారణాలు ఉంటే తన దృష్టికి తెచ్చి పరిష్కార మార్గాలు కోరాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం లబ్ధిదారులు సంతృప్తి ధ్యేయంగా అత్యాధునిక సాంకేతిక తను జోడించి అన్ని రకాలుగా పర్యవేక్షణ వ్యవస్థను బలోపేతం చేసిందని ఆ దిశగా అధికార యంత్రాంగం తగిన చొరవ చూపాలన్నారు. కార్యక్ర మంలో జెసి టి.నిషాంతి, ఆర్‌డిఒలు పి.శ్రీకర్, దేవరకొండ అఖిల, జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా వెంకన్న బ్రహ్మోత్సవాలు

ప్రజాశక్తి - ఆలమూరు

చింతలూరు శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ద్వితీయ వార్షిక పాంచాహ్నిక బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నార. నాలుగవ రోజైన గురువార తిరుప్పావడ సేవను నిర్వహించారు. ఈ సేవలో భాగంగా సుమారు 200 కేజీల పులిహోరను స్వామి వారి ఎదురుగా రాశిగా పోసి, నివేదన చేశారు. తదుపరి ఈ ప్రసాదాన్ని యాత్రికులకు పంచిపెట్టారు. తిరుప్పావడ సేవను దర్శించడానికి యాత్రికులు ఆలయానికి వచ్చారు.

చిడిపిలో 65 మందికి నేత్ర వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - తాళ్లపూడి

కొవ్వూరు మండలం చిడిపి గ్రామంలో సర్పంచి పాలడుగుల లక్ష్మణ రావు ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో 65 మందికి వైద్య పరీక్షలు చేశారు. నిడదవోలు శ్రీమతి రాజేశ్వరి రామకృష్ణన్ లయన్స్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో నడుస్తున్న తాళ్లపూడి బ్రాంచ్‌కి చెందిన వైద్యులు వైద్య సేవలు అందించారు. 11 మందికి ఆపరేషన్ చేయాలని గుర్తించారు.

పాఠశాలకు సామగ్రి అందజేత

ప్రజాశక్తి - పెరవలి

మండలంలోని కానూరు ప్రాథమిక పాఠశాల నెం-3కు ఉండ్రాజవరం మండలం పాలింగిలోని ఐడిబిఐ బ్యాంక్ బ్రాంచ్ ఫర్నిచర్, కంప్యూటర్ టేబుల్స్ కుర్చీలు, ప్లాస్టిక్ కుర్చీలు, ఆరఒ వాటర్ ప్లాంట్‌ను అందించారు. రూ.55 వేల విలువైన ఈ సామగ్రిని హెచ్ఎం షేక్ మస్తాన్‌కు గురువారం స్వయంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో రావులపాడు ఐడిబిఐ బ్రాంచ్ మేనేజర్ చుండ్రు రమేష్, పాలింగి ఐడిబిఐ బ్రాంచ్ మేనేజర్ నూక కార్తీక్, అసిస్టెంట్ మేనేజర్లు కప్పల అశోక్, కె.కోటేశ్వరరావు, పి.వెంకటరాయుడు, నాగమణి, శాంతి పాల్గొన్నారు.

కె.సావరం గ్రామం సిల్వర్ మెడల్‌కు ఎంపిక

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

ప్రధానమంత్రి టిబి ముక్త్ పంచాయతీల పరిశీలనలో భాగంగా జిల్లా వెరిఫికేషన్ బృందం గురువారం మండలంలోని కె.సావరంలో పర్యటించింది. ఇప్పటివరకు మండలంలోని దమ్మెన్ను, సత్యవాడ, కే సావరం గ్రామాలు వివిధ మెడల్స్‌కు ఎంపికయ్యాయి. అలాగే కె.సావరంలో పరిశీలన చేపట్టినట్లు జిల్లా అదనపు వైద్యాధికారి, జిల్లా క్షయ ఎయిడ్స్ అండ్ లెప్రసీ వైద్యాధికారి డాక్టర్ ఎన్.వసుంధర, మెడికల్ కాలేజీకి చెందిన కమ్యూనిటీ మెడిసిన్ విభాగం డాక్టర్ సురేంద్ర తెలిపారు. ఈ సందర్భంగా కె.సావరం గ్రామం 2023లో బ్రాంజ్ మెడల్‌ను సాధించగా, 2024 సంవత్సరానికి సిల్వర్ మెడల్‌కు ఎంపికైందని తెలిపారు. 2024లో నమోదైన టిబి నిర్ధారణ పరీక్షలు, నమోదైన టిబి రోగుల వివరాలు, నిక్షయ్ పోషణ యోజన, పోషకాహార కిట్లు, 2023 సంవత్సర అవుట్ కమ్‌లను పరిశీలించి, సంతప్తి వెలిబుచ్చారు. సర్పంచ్ నార్ని రామకృష్ణ, ఉండ్రాజవరం పిహెచ్‌సి వైద్యాధికారి ఆర్.ఉషాదేవి, ఎస్‌టిఎస్.ఆశాజ్యోతి, పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు. ఎంఎల్ హెచ్‌పి , ఎఎన్ఎం వెరిఫికేషన్ బృదానికి రికార్డుల రిపోర్టులను సమర్పించారు.

ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు ఏర్పాట్లు

ప్రజాశక్తి - గోపాలపురం

గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి ఎన్నికలు ప్రశాంతగా జరిగేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని ఒఎన్‌జిసి, డిప్యూటీ కలెక్టర్ ఎలక్ట్రోల్ రిటర్నింగ్ అధికారి భాగ్యవతి సూచించారు. గురువారం మండలంలోని, గోపాలపురంలో 259, 260, 261 పోలింగ్ కేంద్రాలను ఆమె పరిశీలించారు. ఓటర్లకు స్లిప్పులను త్వరితగతన అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిటి లక్ష్మీదేవి, ఎలక్షన్ సీనియర్ అసిస్టెంట్ కె.నల్లరాజు, విఆర్ఒలు, బిఎల్ఒలు, శ్రీనివాస్, జివివి.లక్ష్మీబాల కుమారి తదితరులు పాల్గొన్నారు.

మేలైన ఉత్పత్తులకు అంతర్జాయతీ మార్కెట్

ప్రజాశక్తి- గోపాలపురం

మేలైన వ్యవసాయ పద్ధతులు ద్వారా సాగు చేసిన ఉత్పత్తులను ఇండి - గ్యాప్ సర్టిఫికేషన్ ద్వారా 129 దేశాల్లో విక్రయించుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం సన్నాహాలు చేస్తుందని మండల వ్యవసాయ అధికారి బి.రాజారావు తెలిపారు. రాంపాలెంలో గురువారం నిర్వహించిన పొలంబడిలో ఆయన పాల్గొని మాట్లాడారు. రైతులు శాస్త్రవేత్తల సూచనల ప్రకారం సాగు చేస్తే మేలైన ఉత్పత్తులు వస్తాయన్నారు. ఈ వివరాలను ఎప్పటికప్పుడు సంబంధిత రికార్డులలో నమోదు చేస్తారన్నారు. పొలాలను తనిఖీ చేసి సమగ్ర సస్యరక్షణ, పంటల సాగు యాజమాన్య పద్ధతలపై సూచనలు ఇస్తారాన్నరు. దగ్గరలో ఉన్నటువంటి రైతు ఉత్పత్తిదారుల సహకార సంఘాలతో అనుసంధానం చేసి వారి ద్వారా తనిఖీలు నిర్వహించి పంట పండించిన తదుపరి పంట ఉత్పత్తులను పురుగుమందుల అవశేషాలు ఎంత ఉన్నాయో నాణ్యత నిర్ధారణకు పంపి ధ్రువీకరణ పత్రం ఇస్తారన్నారు. విచక్షణారహితంగా ఎరువులు వాడరాదన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి -దేవరపల్లి

దేవరపల్లి 33/11కెవి సబ్ స్టేషన్ మరమ్మత్తులు నిమిత్తము శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు దేవరపల్లి సబ్ స్టేషన్ పరిధి లో 11 కెవి అచ్చియ్యపాలెం ఫీడర్, 11కెవి గొల్లగూడెం ఫీడర్, 11 కెవి దేవరపల్లి ఎంహెచ్‌క్యూ ఫీడర్, 11కెవి బంధపురం ఫీడర్, 11 కెవి ఇండస్ట్రీల్ ఫీడర్, 11కెవి మార్కెట్ ఫీడర్‌లకు విద్యుత్ సరఫరాను నిలిపేస్తుఅన్నమని ఎపిఇపిడిసిఎల్ ఇఇ నారాయణ అప్పారావుత తెలిపారు. ఆయా ఫీడర్ల పరిధిలోని గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. దేవరపల్లి, బంధపురం, గొల్లగూడెం గ్రామాలకు విద్యుత్ అంతరాయం కలుగుతుందన్నారు. అగ్రికల్చర్ సప్లై ఉదయం 6 గంటల నుంచి 10 గంటల వరకు, మధ్యాహ్నం 1 నుంచి సాయంత్రం 6గంటల వరకూ ఉంటుందన్నారు. **కడియం:** మురముండ 33/11కెవి సబ్ స్టేషన్ నుంచి సరఫరా అయ్యే మాధవరాయుడు పాలెం11 కెవి ఫీడర్‌కు కొత్త పోల్స్ వేయుట నిమిత్తం విద్యుత్ సరఫరాను శుక్రవారం ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు నిలిపేస్తున్నట్లు రాజమహేంద్రవరం రూరల్ ఇఇ దాట్ల శ్రీధర్‌వర్మ తెలిపారు. మాధవరాయుడు పాలెం, దామిరెడ్డి పల్లి గ్రామాలలోని వ్యవసాయ బోర్లకు, గృహాలకు అంతరాయం కలుగునన్నారు. **గోకవరం:** గోకవరం మండలంలోని 11కెవి ఆర్ అండ్ ఆర్ కాలనీ ఫీడర్ మరమ్మతుల నిమిత్తమై శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరక ఆర్అండ్ఆర్ కాలనీ, పూడిపల్లి ఆర్ అండ్ ఆర్ కాలనీ, వీరలంకపల్లి, పెంటపల్లి, రంప ఎర్రంపాలెం గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలపేస్తామన్నారు. దీనికి వినియోగదారులు సహకరించాలని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ దాట్ల శ్రీధర్‌వర్మ తెలిపారు.

నేడు వ్యవసాయ విద్యుత్ సరఫరా నిలిపివేత

ఉండ్రాజవరం: మండలంలోని ఉండ్రా జవరం సెక్షన్, ఉండ్రాజవరం సబ్ స్టేషన్ పరిధిలో 33/11 కెవి, 11కెవి సత్యవాడ ఫీడర్ ట్రీ కటింగ్ పనుల నిమిత్తం శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సత్యవాడ, ఉండ్రాజవరం గ్రామాల వ్యవసాయ విద్యుత్ వినియోగదారులకు సరఫరా తాత్కాలికంగా నిలిపివేయనున్నట్లు ఎపిఇపిడిసిఎల్ నిడదవోలు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎన్.నారాయణఅప్పారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా విద్యుత్ వినియోగదారులు సహకరించవలసిందిగా ఆయన కోరారు.

తల్లిదండ్రుల పట్ల ప్రేమతో మెలగాలి

ప్రజాశక్తి - నల్లజర్ల

ప్రతి కుమారుడు తల్లితండ్రుల పట్ల ప్రేమతో మెలగాలని జనసేన గోపాలపురం నియోజకవర్గం ఇన్‌ఛార్జి దొడ్డిగర్ల సువర్ణరాజు అన్నారు. నల్లజర్లలోని స్థానిక హర్ష మొబైల్ అధి నేత మల్లిపూడి రాజారావు తన తండ్రి మల్లిపూడి భాస్కరరావు జ్ఞాపకార్థం ఆయన విగ్రమాన్ని ఇంటి ఆవరణలో ఏర్పాటు చేసుకున్నారు. దీన్ని సువర్ణరాజు ఆవిష్కరించారు. అలాగే ఆయన జ్ఞాప కార్థం బరియల్‌గ్రౌండ్ వద్ద వాటర్ ట్యాంక్ నిర్మిం చారు, నల్లజర్లలో బాటసారులు కూర్చో వడానికి బల్లలు ఏర్పాటు చేశారు, ఈ కార్యక్ర మానికి విచ్చేసిన వారికి 1000 మొక్కలు పంపిణీ చేశారు. రాజారావు కుటుంబ సభ్యుల సేవలను పలువురు కొనియాడారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు తాతిన సత్యనారాయణ, అల్లాడ రాజారావు, మల్లిపూడి కృష్ణారావు, జనసైనికులు పాల్గొన్నారు.

ఆక్వా అక్రమ చెరువులతో పర్యావరణ సమస్యలు

ప్రజాశక్తి - కొత్తపేట

అక్రమ ఆక్వా చెరువులు కారణంగా పర్యావరణం సమస్యలు ఎదురవుతున్నాయి అని జిల్లా టిడిపి అధికార ప్రతినిధి ముత్యాల బాబ్జి అన్నారు. ఆయన గురువారం విలేకరులతో మాట్లాడుతూ నియోజక వర్గంలో అవిడి, పలివెల, గంటి, ఈతకోట తదితర ప్రాంతాల్లో యథేచ్ఛగా చెరువులు తవ్వకాలు జరుగుతున్నాయని అన్నారు. తవ్వకాల వలన పర్యావరణానికి హాని కలిగించే విధంగా ఉందని భావించి జాతీయ హరిత ట్రిబ్యునల్ ఆదేశాలు జారీ చేసిందన్నారు. జిల్లా అధికార యంత్రాం గం చర్యలు తీసుకోవాలన్నారు.